# నమ్మలేని నిజం

శారద

*ప్రాణి కోటికి క్రౌర్యం సహజం. కాదనడం సాధ్యం కాదు. హృదయంలో క్రౌర్యానికి తావు లేకుండా చేయగలిగిన వాడే మానవుడు. తొలుత ఏలాంటి స్థితిలో ఉన్నా పసిపిల్లల అమాయక హృదయం అర్థం చేసుకొన్నవాడు స్పందించక పోడు. ఉత్తముడు కాకుండానూ ఉండలేడు. అతనికి అసాధ్యమైనదీ లేదు, మరి.*

ఆ రోజు కేడీ గురువులు ఐదు గంటలకు విడుదల అవుతాడని అన్ని పత్రికలు పెద్ద అక్షరాలతో ప్రచురించినై. అంతవరకు గుండెల మీద చేయివేసుకొని హాయిగా నిద్రపోయిన షావుకార్ల కీ వార్త మళ్లీ హడలు పుట్టించింది. ఇక తమ పని దినగండం నూరేళ్ళాయుస్సనుకొని ఆ రోజు కొట్లన్నీ మూసేసి గురువుల్ని చూడటానికి జనం విపరీతంగా వచ్చి నిలబడ్డారు.

ఐదు గంటలు కాగానే ఇద్దరు పోలీసులు గురువుల్ని బయటవరకు తీసుకువచ్చి వదిలి పెట్టి వెళ్లిపోయారు. నెమ్మదిగా ఒక సారి తలెత్తి చూచి దించుకొని నడుస్తున్నాడు. ఇరువైపుల జనసమూహం గురువుల్ని గురించి అనేక విధాలుగా చెప్పుకుంటున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా, గురువులు వంచిన తలెత్తకుండానే నడిచిపోతున్నాడు. కొద్దిసేపటి దాకా జనం నిలబడి చూచి తర్వాత ఎటువాళ్లటు వెళ్లిపోయారు.

బజార్లలో ఆడుకొనే పిల్లలు గురువుల భీకరాకారాన్ని చూచి ఎటువాళ్లటు చెదిరి పోతున్నారు. తనను చూచి ప్రజలు ఇట్లా ఎందుకు భయపడుతున్నారో గురువులుకు అర్థం కాలేదు. ఒకప్పుడు చేసిన తప్పునుబట్టి ప్రజలు తనను ''కేడీ'' అని పిలిచారు. తనకు జరుగక తను దొంగతనానికి అలవాటుపడ్డాడని ఎవరికీ తెలీదేమో ! అనేక సంసారాలు తిండిలేక మలమల మాడుతూ, అనేక బాధలకు లోనవుతున్నా,



లెక్కచేయక, కనికరించక, పాషాణ హృదయాలు గల షావుకార్లు తమ వడ్డీలతో సహా వసూలు చేస్తున్నారు. వాళ్లు ఎందరి ప్రాణాలను బలిగొన్నారో! పాపం!! అందుకని తను వాళ్ల డబ్బు అపహరించి బీదలకు ఎంతో సహాయం చేశాడు. దానికి ప్రతిఫలంగా తనను జైలులో పెట్టారు. తనను లోకం "కేడీ" గానే గుర్తించింది గాని, తను ఎందుకు, ఎవరి కోసం చేశాడో అర్థం కాలేదు లోకానికి అనుకుంటూ చిరునవ్వు నవ్వి వెళ్లిపోతున్నా డొక వీధిలో నుండి. అక్క డాడుకుంటున్న పిల్లలు గురువుల్ని చూడగానే పరుగెత్తారు కాని మూడేళ్లమ్మాయి మాత్రం అక్కడే నిలబడింది. పరుగెత్తుతున్న పెద్దపిల్ల మాత్రం "రమా! దొంగాడు. నిన్ను ఎత్తుకుపోతాడు. రా మ్మా" అని పిలిచింది. ఆ అమ్మాయిమాత్రం తొణకకుండా "ఏయ్! ఎవరు నువ్వు?" అన్నది గురువులుతో.

"నేను దొంగాణ్ణమ్మా!" అంటూ నవ్వుతూ జవాబిచ్చాడు. "మరి నువ్వు దొంగతనం ఎందుకు చేశావ్?" అని ప్రశ్నించింది. ఆ అమ్మాయి నోటినుండి అలాంటి ప్రశ్న రావటం విని ఆశ్చర్యపోయాడు. తన ఈ నలభై రెండేళ్లలో తనను ఎవ్వరూ ఇంత సూటిగా అడగలేదే? చిన్నమ్మాయి అడిగిన ప్రశ్నకు జవాబు ఏమని చెప్పేదనుకుంటూ, బిక్క ముఖంవేసి చూస్తూ ఊరుకున్నాడు.

"ఆకలైతే చేశావా దొంగతనం?" అన్నది నెమ్మదిగా ఏమీ తోచక. "అవునమ్మా—!" అని ఊరుకున్నాడు.

"మా ఇంటికిరా. అన్నం పెట్టిస్తాను. మరి, నాతోనే ఆడుకుంటావా ఎక్కడికీ పోకుండా?" అన్నది రమ.

ఇకనుండి దొంగతనం చేయగూడదనుకొన్న తనకు ఈ అమ్మాయి పలుకులు పసిడిపలుకుల్లా తోచి, "సరేనమ్మా!" అని రమను ఎత్తుకొని, "ఇల్లు చూపించమ్మా?" అని బయలుదేరాడు.

మీసాలు దువ్వుతూ, "మరి నువ్వు ఎక్కడన్నా పోతావా మళ్లీ?" అని అడిగింది రమ.

"ఎక్కడికీ పోనమ్మా నీదగ్గర ఉంటా" అని అన్నాడు.

"నీపేరేమిటి?" అన్నది.

"నా పేరా? నా పేరు 'తాత'" అని జవాబిచ్చాడు.

"నీ పేరు 'తాత'. భలే బాగుంది. మా నాన్నతో చెప్పి మా ఇంట్లోనే ఉండనిస్తాలే" అన్నది.

"సరే లేమ్మా" అన్నాడు.

కొంతదూరం పోయిన తర్వాత ఒక మేడ చూపిస్తూ, "అదే మా ఇల్లు, రా పోదాం" అంటూ దిగి చేయి పట్టుకొని లోపలకు తీసికెళ్లింది. ఇంత లేత హృదయం తనను ఆక

# నమ్మలేని నిజం

ర్షించినందుకు భగవంతునకు నమస్కరించాడు మనసులోనే.

"రమా! ఇంతసేపు ఎక్కడకు పోయావమ్మా?" అని ఎత్తుకుంటూ అడిగాడు సబ్‌ఇన్‌స్పెక్టర్ చంద్రం.

"మరే! నేను ఆడుకుంటున్నాను. అక్కడకు 'తాత' అనే దొంగ వచ్చాడు. మరేమో దొంగతనం చేశాడట. ఇక నాతోనే ఉంటాడట. అందుకని పిల్చుకొచ్చాను" అన్నది రమ.

"ఏది చూద్దాం పద" అంటూ బయటకు వచ్చా రిద్దరూ. గురువులు తల వంచుకొని నిలబడ్డాడు.

"ఎక్కడమ్మా?" అన్నాడు చంద్రం.

"ఇతనే నాన్నా 'తాత'" అన్నది గురువులు చేయి పట్టుకుంటూ. నెమ్మదిగా తలెత్తి చూచాడు. గురువుల్ని చూడగానే దిగ్భ్రమ చెందాడు చంద్రం. "తన డిపార్టుమెంటు కొక సింహస్వప్నంగా తయారైన కేడీ గురువులు పని చేయటానికి తనింటికి వచ్చాడా! తన ప్రబల శత్రువు తన ముద్దుల కూతుర్ని ఆకర్షించాడా! తన శత్రువుకు తనింట్లో ఆశ్రయ మివ్వటం పామును పెంచుకున్నట్లే" అనుకుంటూ అలానే నిలబడిపోయాడు.

గురువులుకు ఇదంతా అయోమయంగా ఉన్నది. "తను రాక రాక పనికోసం తన విరోధి ఇంటికే వచ్చాడన్నమాట. విరోధి కూతురు తనను ఆకర్షించటం; అంతా ఆశ్చర్యంగానే ఉన్నది. అమాయిక పాపాయి కేం తెలుసు తమ ఇద్దరి మధ్యఉన్న విరోధాలు" అనుకున్నాడు.

"ఏమిటి, నాన్నా, మన ఇంటో ఉండనిద్దామా?" అని అడిగింది.

"వద్దమ్మా" అన్నాడు.

"ఊ, తాతను ఉండనిద్దాం" అని మారాం మొదలుపెట్టింది.

"నీకు తెలీదమ్మా, వద్దులే."

"ఊ, ఊ, ఉండనిద్దాం" అని ఏడ్వటం మొదలుపెట్టింది.

"చెప్తుంటే నీక్కాదు; వద్దంటూంటే" అని ఒక దెబ్బ కొట్టాడు. ఈ సంభాషణంతా విన్న గురువులు నెమ్మదిగా బయలుదేరాడు.

లోపలనుండి సుశీల వచ్చి "ఎందుకండీ అమ్మాయిని కొట్టేండి" అన్నది కోపంతో.

"కేడీ గురువుల్ని మనింట్లో ఉంచాలట. వాడితో ఆడుకుంటుందట" అన్నాడు కసురుతూ.

"ఏం? ఉంచితే మనింట్లో?"

"నీక్కూడా తల తిరుగుతూందా?"

"జీవితంలో ఒకసారి తప్పు చేస్తే ఇక జీవితాంతంవరకు ఆ తప్పు చేయకపోయినా, ఆ తప్పుతోనే బాధపడవలసిందేనా?"

"అదంతా నీకెందుకు? మా సంగతి."

"అమ్మా! తాత పొయ్యాడే" అని ఏడుస్తున్నది రమ.

"పిలవండి వాణ్ణి. అమ్మాయి అల్లాడి పోతూంది."

"చెప్తుంటే నీక్కాదూ వీల్లేదని" అంటూ ఇంట్లోకి వెళ్లాడు.

• • •

"ఏమండీ! అమ్మాయి వళ్లు కాలిపోతూంది. చూడండి, రాత్రి చాలాసార్లు కలువరించిందండీ" అన్నది కళ్లనీళ్లు తుడుచుకుంటూ.

"నీ మొహం. నీ ఇష్టం, నీ కూతురి ఇష్టమేనన్నమాట" అన్నాడు.

"తాతా, ఆడుకుందామా?" అంటూ కలువరించింది.

అంత కఠిన హృదయం గల గురువులు ఇంత లేత హృదయాన్ని ఎట్లా ఆకర్షించాడబ్బా! సుశీల అన్నది నిజమే కావచ్చు. వాణ్ణి తీసుకురాకపోతే పరిస్థితి విషమిస్తుందనుకుంటూ, ఊరుకుంటే లాభంలేదు, తన కూతురు తన కిక దక్కదనుకొని మోటారు బైక్‌మీద గురువులుకోసం బయలుదేరాడు. ఊరంతా గాలించాడు ఎక్కడా కనపడలేదు. నిరాశ చెంది ఇంటి దారి పట్టాడు. కొద్ది దూరంలో ఎవరిదో ట్రంకుపెట్టె మోస్తూ కనిపించాడు. కళ్లు ఆనందంతో మెరిశాయి. దగ్గరకుపోయి బైక్‌ను ఆపాడు. పెద్దమనిషికి కంగారు పుట్టి,

"ఏ, ఏ, ఏమిటండీ?" అన్నాడు.

"ఏమీ లేదండీ" అని గురువులుతో, "గురువులూ, ఇంటికి పోదాం రా" అన్నాడు.

గురువులు అమాయికంగా ముఖం పెట్టి, "ఏమిటండీ బాబుగారూ?" అన్నాడు.

"వెనక్కు పోదాం" అన్నాడు. ఏమీ మాట్లాడకుండా ఎక్కి కూర్చున్నాడు.

"ఏమండీ! ఇంకొక కూలివాణ్ణి పిలిచి తీసుకెళ్లండి మీ పెట్టెను" అని స్టార్ట్ చేశాడు.

వస్తూ "గురువులూ! ఏమీలేదు నీ చేతివృత్తి మానేస్తావా?" అన్నాడు.

"ఇక నా జన్మలో చెయ్యనని ఒట్టు వేసుకున్నానండీ బాబుగారూ!" అన్నాడు సంతోషంతో.

ఇద్దరూ ఇంటికి వచ్చారు. వస్తూనే రమ

అందరినీ మెప్పించగలవాడు పుట్టకుండానే చనిపోయాడు.

—సామెత

* * *

నేను పొగడలేని దానిని గురించి మాట్లాడను.

—గెతే

వచ్చాక పరుగెత్తాడు గురువులు.

"పాపా! ఇటు చూడు వచ్చానమ్మా చూడమ్మా" అన్నాడు కన్నీళ్లతో.

కండ్లు తెరిచి "తాతా, వచ్చావా?" అని మెడ చుట్టూ చేతులు పెనవేసింది.

ఈ దృశ్యం చూచి సుశీల, చంద్రం కళ్ల నీళ్లు తుడుచుకున్నారు. మరునాటినుండి గురువులు ఆ ఇంట్లో ఒకడుగా మెలగసాగాడు. ప్రొద్దున్నే నీళ్లు తోడటం, బజారుకుపోయి కూరగాయలు తీసుకురావటం, రమను ఆడించు కోవటం, సాయంత్రం తోటపని, తర్వాత షికారుకు పోవటం—ఈ విధంగా నడుస్తోంది గురువులు దినచర్య.

"తాతా! అదేంటి తాతా ?" అన్నది.

"అదా, దాన్ని 'స్టీమరు' అంటా రమ్మా. దానిమీద ఇతరదేశాలకు పోతారమ్మా."

"దానిమీద పోయి నేను చదువుకుంటాను" అంటూ నవ్వింది.

"నువ్వు పోతే నే నెట్లమ్మా?"

"నిన్ను గూడ తీసుకుపోతాను తాతా !"

"నన్ను గూడ తీసుకుపోతావమ్మా !" అంటూ హృదయానికి హత్తుకున్నాడు. కళ్లనుండి నీళ్ళు జలజలా రాలినై.

"సరే లేమ్మా. పద ఇంటికి పోదాం" అంటూ ఎత్తుకొని ఇంటికి బయలుదేరాడు.

ఒకరోజు ఒకపోలీసు ఏదో పనుండి ఇంటికి వచ్చి గురువుల్ని చూచి పోయి ఆఫీసులో అందరితోటీ చెప్పాడు. సందేహిస్తూనే అందరూ అడిగారు. అందరికీ నవ్వుతూ సమాధానమిచ్చాడు.

మధ్యాహ్నం చంద్రం గురువుల్ని పిలిచి "గురువులూ! నీ గురించి అందరూ అడుగు తున్నారు" అన్నాడు.

"ఏమిటి బాబుగారూ?" అన్నాడు.

"నీ గురించి అందరికీ ఏమని చెప్ప మంటావ్ ?"

"తమ రిష్టం బాబూ—" అని నవ్వి వెళ్లి పోయాడు.

చంద్రం ఇంట్లోకి వెళ్లి సుశీలతో "చూశావా ? సుశీ, నీ మాటే నెగ్గిందిగా" అన్నాడు.

"ఏమిటండీ అది ?"

"గురువుల్ని గురించి నీ వన్నదే నిజమయింది" అన్నాడు దగ్గరకు తీసుకుంటూ.

"అబ్బ, ఉండండీ. ఎవరన్నాచూస్తారు" అన్నది తప్పుకుంటూ.

"సుశీ, గురువుల్ని పూర్తిగా నమ్మావా?"

"ఏం ? మీరు నమ్మలేదా ?"

"ఆహా ! నేను నమ్మలేదు. అలవాటుపడిన చేయిగదూ, ఊరుకోదు. తెలుసా ?"

"మీ ఇష్టం ! నమ్మకపోతే పోనీయండి" అన్నది సుశీల. డ్రస్సు వేసుకొని చంద్రం వెళ్లి పోయాడు—బయటకు వచ్చి రమను, గురువుల్ని చూచి తృప్తిగా.

"తాతా. ఇవాళ నా పుట్టిన రోజు పండుగ తెలుసా ?" అన్న దొక రోజు రమ.

"మరి ! నాకేం ఇస్తావ్ ?"

"నీకేం కావాలి?"

"నాకు నువ్వుంటే చాలు, ఇంకేమీ వద్దు" అంటూ ముద్దు పెట్టుకున్నాడు.

సాయంత్రం గురువులు ఏమిటో తీసుకు రావటానికి బజారు వెళ్ళాడు. రమ ఆడుకోటా నికి పోయింది. కొద్దిగా చీకటి పడింది. రమ ఇంకా రాలేదు ఇంటికి. సుశీల కంగారుగా, ఏమీ తోచక అలాగే ఉండిపోయింది. చంద్రం వచ్చి, "అమ్మాయేదీ" అని సుశీలను అడిగాడు.

"ఆడుకోటానికి బయటకుపోయి, ఇంకా రాలేదండీ" అన్నది.

"గురువులు ఎక్కడకు పోయాడు?"

"బజారుకు పోయి ఇంకా రాలేదండీ."

"ఇంకేం? వాడిపనే అయిఉంటుంది—నేను చెబితే విన్నావూ? ఇక అఘోరించు."

"గురువులు అలా ఎన్నటికీ చేయ డండీ!"

"నీకు చెప్పి తీసుకుపోతాడనుకున్నావా ? మనకు వాడు బద్ధ శత్రువు. అలాంటివాణ్ణి ఇంట్లో పెట్టించావు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టాడు వాడు."

"చాల్లెండి. వస్తువు ఒకచోట; అనుమాన మొకచోట అనేలాగుందే మీ వ్యవహారం?"

"నీకేం?—బుద్ధులు బాగానే చెప్తూండు. అవతలవాడు అమ్మాయిని చేయవలసిన పని చేస్తాడు. వాణ్ణి నేను మొదటినుండీ నమ్మలేదు. నేను అనుకుంటూనే ఉన్నాను—వాడు ఏదో ఒకటి చేస్తాడని."

ఏడుస్తూ, "అమ్మాయి కనపడక ఏడు స్తూంటే మీ వాదం ఏమిటండీ ?" అన్నది.

"వాడు రానీ చెప్తాను" అంటూ ఇంట్లోకి వెళ్లాడు.

సుశీలకు మాత్రం గురువులు తీసుకుపోలే దని నమ్మకంగా ఉన్నది. సొమ్ముల కాశపడి ఎవరో తీసుకుపోయి చంపుతారేమోనని భయ ముతో ఏడుస్తూనే ఉన్నది.

ఇంతలో గురువులు సంచి తీసుకుని రాగానే "ఒరేయ్ ! అమ్మాయిని ఎక్కడ దాచావురా?" అన్నాడు చంద్రం.

గాభరాగా, "అమ్మాయి—దాచిపెట్టట మేమిటి ? బాబుగారూ?" అన్నాడు సంచి వదిలిపెట్టి.

"మర్యాదగా చేసిన పనికి క్షమాపణ కోరి అమ్మాయిని తీసుకురా, పో" కోపంతో అన్నాడు.

"ఏమిటండీ ? ఏం చేశానండీ?"

"గురువులూ! మర్యాదగా చెప్తున్నా. అమ్మాయిని తీసుకుపోరా."



విచ్చిన పువ్వు
చిత్రం—బి. శశి
(శేకుసెట్టిపాలెం)


"నాకు ఏమీతెలియదు బాబుగారూ" అన్నాడు తలవంచుకొని. కోపం పట్టలేక చంద్రం బూటుకాలితో మొహంమీద తన్నాడు. ఆ తన్నుతో పోయి దూరంగాపడి, మళ్లీ లేచివచ్చి, "మీరూ నమ్మలేదా?" అన్నాడు నోటినుండి వచ్చే రక్తాన్ని తుడుచుకుంటూ.

"గురువులూ, పోయి తీసుకురా" అన్నది అనలేక.

"హు, మీరు కూడా నమ్మలేదమ్మగారూ! ఈ రోజుల్లో నిజం చెబితే ఎవ్వరూ నమ్మ రమ్మ గారూ. సరే. నా చిట్టితల్లిని ఎక్కడున్నా సరే రేపు ఉదయానికి సాధించి తీసుకువస్తాను. వట్టి చేతులతో మీ ముఖం చూడలే నమ్మ గారూ !" అంటూ వెళ్లిపోయాడు.

* * * *

అర్ధరాత్రి దాటినా ఎక్కడా కనపడలేదు. దూరంగా ఎక్కడో కుక్కలు అరుస్తున్నాయ్. చీకటిని పారద్రోలలేక వీధి దీపాలు బిక్కమొగం వేసినట్టు మినుకు మినుకు మంటున్నాయ్. తను దొంగతనం చేసే రోజుల్లో అమ్మాయిల్ని ఎత్తుకొనిపోయి సొమ్ములు తీసుకునే చోటు గుర్తుకు వచ్చింది. ఎందుకయినా మంచిదనుకొని బయలుదేరాడు. ఊరినుండి దరిదాపు మైలు దూరంలో ఉన్న ఈతపొదల మధ్య పాడుబడిన గుడికి వచ్చి చుట్టూరా చూశాడు. పురుగులు



ఎందుకీ పోరు ? ఫోటో—ఇస్సాక్ మాచ్యూస్ (సికిందరాబాదు)

మాత్రం "గీ" అని అరుస్తున్నాయ్. ఎక్కడా అలికిడి కావటంలేదు. అమ్మగారికి ఇచ్చిన మాటను నిలబెట్టాలి. తన ప్రాణాలు పోయినా సరే అనుకుంటూ, లేచి రాబోయేటంతలో చిన్నగా మూలుగు వినిపించింది. ఎక్కడబ్బా అనుకుంటూ పోయి మళ్లీ చూశాడు. ఏమీ కనిపించలేదు. వచ్చి గుడి బయట కూర్చున్నాడు. లోపల ఏదో అలికిడి అయినట్టుంది. మెల్లగా లేచి శబ్దం కాకుండా తలుపు ఓరగా తెరచి చూచాడు. లోపలి దృశ్యం చూడగానే వాణ్ణి ప్రాణాలతో పోనివ్వగూడదనుకొని మెల్లగా లోనికి పోయి పిడికిలి బిగించి మెడమీద ఒక్క వేశాడు. ఆ దెబ్బతో వాడు కిక్కురుమనకుండా పడిపోయాడు. కాళ్ల, చేతుల కట్లూడదీసి సొమ్ములు తీసుకొని నోట్లో ఉన్న గుడ్డ తీసేసి, "పాపా!" అంటూ పిలిచాడు. పాప పలుకలేదు. ఎత్తుకొని కోనేటిదగ్గరికిపోయి ముఖంమీద నీళ్లు చల్లి నెమ్మదిగా ఇంటి దారి పట్టాడు. సగానికి పైగా వచ్చాడు.

"అరేయ్ ! ఎవ్వడ్రా నువ్వు, ప్రాణాలమీద ఆశుంటే నిలబడు" అన్నాడు వాడు.

"రోజులు మూడినయ్యా నీకు?"

"నీకా, నాకా ? హ హ హ" అంటూ వచ్చాడు. వీడి వ్యవహారం ముదిరిందే అనుకొని గడ్డిమీద పాపను పండబెట్టి వచ్చాడు.

## నమ్మలేని నిజం

"నీపే రేంటిరా ?"

"నువ్వే చెప్పరా ?"

"నా పేరు గురువులు."

"అలాగా, నా పేరు కోటిగాడు."

"హు, దొరికావన్నమాట. ఆనాడు తప్పించుకున్నావుగదూ !"

"ఏడిశావులే! ఇక పో."

"నిన్ను సఫా చేసి పోతానురా."

"అలాగైతే కాచుకో" అంటూ కత్తితో విసురుగా వచ్చాడు. చురుకుగా దెబ్బ నుండి తప్పుకొని చేయి మెలిపెట్టి,

"కత్తి క్రింద పడేయ్‌రా?" అంటూ విరిచాడు.

"అబ్బా !" అంటూ వదిలిపెట్టాడు. మెడమీద ఒక టిచ్చాడు. గిర్రున తిరుగుతూ పడ్డాడు. రమ దగ్గరకు పోయి ఎత్తుకునేటంతలో కోటిగాడు వచ్చి కత్తితో డొక్కలో పొడిచాడు.

"అబ్బా!" అంటూ క్రింద పడిపోయాడు.

"హు, మరి కోటిగాడి దెబ్బంటే ఏమనుకున్నావ్ ?" అంటూ మీసం దువ్వి కత్తి పారేసి రమను ఎత్తుకొని ఊరి వైపు బయలుదేరాడు.

నెమ్మదిగా లేచి చూచాడు. రక్తం కారిపోతూంది. "చివరకు కోటిగాడి చేతిలోనా ? సహించరాని అవమానం" అనుకుంటూ కత్తి తీసుకొని గబగబా కోటిగాడి దగ్గరకు పోయాడు.

"అరేయ్ ! మర్యాదగా అమ్మాయిని వదిలిపెట్టు."

"నీ మొహం, పోరా ?" అంటూ వెనక్కు తిరిగి ఒక్క తన్ను తన్నాడు. గింగిరాలు తిరుగుతూ క్రిందపడ్డాడు గురువులు.

అమ్మగారి మాట తీర్చిగాని చావగూడదనుకొని లేచి గబగబా వచ్చాడు కోటిగాడి దగ్గరికి. ఇద్దరూ తాటితోపులోకి వచ్చారు. తొందరగా వెళ్లిపోతున్న కోటిగాడి వీపున బలంగా పొడిచాడు. అంతే. "అబ్బా !" అనుకుంటూ కోటిగాడు ఒక వైపు, అమ్మాయి ఒక వైపు పడిపోయారు. చిన్నగా అమ్మాయిని ఎత్తుకొని ఇంటిదారి పట్టాడు. రక్తం ఇంకా కారిపోతూనే ఉన్నది. కాళ్లు తేలిపోతున్నాయి. కళ్లు తిరుగుతున్నాయి. దారి కనిపించటంలేదు. ఊగుతూ తడబడుతూ గేటు తెరిచి ఇంట్లోకి పోయి వరండాలో రమను పండబెట్టి, సొమ్ములు ప్రక్కన పెట్టి కాళ్ల దగ్గర పడిపోయాడు.

తెల్లవారినతర్వాత సుశీల బయటకు వచ్చి ఇద్దర్నీ చూచి పెద్దగా కేక పెట్టింది. కంగారుగా చంద్రం వచ్చి చూచి అమ్మాయిని ఎత్తుకొని ముఖంమీద నీళ్లు కొట్టాడు. నెమ్మదిగా కళ్లు తెరిచింది రమ.

"ఏమండీ ! గురువులు చనిపోయాడా? అన్నమాట నిలబెట్టుకున్నాడండీ—" అన్నది గాద్గదికంగా.

"అవును, వాడు నిజం చెప్పినా మనం నమ్మలేదుగా? అందుకని నిజం నిరూపించి వెళ్లిపోయాడు" అన్నాడు జీరపోయిన కంఠంతో.

"తాతా, లే తాతా" అంటూ పిలిచింది రమ.

"తాత ఇక లేడమ్మా" అన్నాడు నీళ్లు నిండిన కళ్లతో.

"నిజమే. ఈ రోజుల్లో నిజం చెప్పినా ఎవ్వరూ నమ్మరు. ఎన్ని హత్యలు చేశాడో? ఎంతమందిని గడగడ లాడించాడో ? అలాంటి పాషాణ హృదయం ఎంత నవనీతంగా మారిపోయింది! తను వాడిని చివరి క్షణం వరకూ క్రూరంగానే చూశాడు. దానికి ప్రత్యుపకారంగా తన జీవితానికే పెద్ద సహాయం చేశాడు. దొంగల్లోగూడ శాంత స్వభావులు ఉంటారనేది ఇప్పటికి తన కళ్లెదుటే రుజువయింది. నమ్మలేని నిజాన్ని గురువులు ప్రాణం సైతం లెక్కచేయక తన చేత నమ్మించాడు" అనుకుంటూ కళ్లు మూశాడు. కళ్ల నుండి నీళ్లు టపటపమని గురువులు చేతుల్లోపడి జ్యోతుల్లా మెరిశాయొక క్షణకాలం ! ★